సంపుటి :03 | సంచిక :38 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 16, మార్చి 2026



## వేగవంతంగా పరిష్కరించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రజావాణి కార్యక్రమంలో వినతుల స్వీకరణ

03

# మీడియా చిట్‌చాట్‌లు వద్దు!

## అసెంబ్లీలో అప్రమత్తంగా ఉండాలి..

శాసనసభ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. సభకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు రాకపోవడంపై ఆయన సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యే విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. - అక్షరదర్బార్, హైదరాబాద్



- ప్రతిపక్షాల ప్రశ్నలకు మన వద్ద సమాధానాలు ఉండాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సీఎల్పీ సమావేశం
- హాజరు కాని వారిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు
- నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరికలు

05



చిదురాల విజయరాణి (ఫైల్)

తాడిపత్రి రాకేశ్ (ఫైల్)

శ్వేత (ఫైల్)

# చెదిరిన కలలు ఆగిన గుండెలు

## అమెరికాలో ముగ్గురు వరంగల్ వాసుల మృతి

తాము కన్న కలలను సాకారం చేసుకునేందుకు విదేశాలు వెళ్లి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, కన్నవారి ఆశలను నిజం చేయాలనుకునే ప్రవాసుల ఆశలు అర్ధాంతరంగా అడియాశలవుతున్నాయి. అగ్రరాజ్యంలో స్థిరపడి కుటుంబంతో కలిసి ఆనందంగా గడపాలని వెళ్లిన వారి జీవితాల్లో గుండెపోటు పెను విషాదాన్ని నింపుతోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉండే తీవ్రమైన పని ఒత్తిడి, అటు వృత్తిని ఇటు కుటుంబాన్ని సమన్వయం చేసుకునే క్రమంలో ఎదురవుతున్న మానసిక సవాళ్లు వారి గుండె వేగాన్ని ఆపేస్తున్నాయి. వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాడిపత్రి రాకేశ్ (41) ఆదివారం గుండెపోటుతో మరణించారు. మరో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుమార్తె శ్వేత (41) కూడా గుండెపోటుతోనే కన్నుమూశారు. ఆమె స్వస్థలం హనుమకొండ. మనమన్ని చూద్దామని చిదురాల విజయరాణి (55) అమెరికా వెళ్లి అక్కడే కన్నుమూశారు. ఆమె స్వస్థలం వరంగల్. ముగ్గురు వ్యక్తులు కేవలం వారం వ్యవధిలోనే అమెరికాలో గుండెపోటుతో కన్నుమూయడం ఇటు స్వగ్రామాల్లో, అటు వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. – అక్షరదర్బార్, వరంగల్

05

- వారం వ్యవధిలోనే మూడు ఘటనలు
- వీరిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు.. ఒకరు మహిళ, మరొకరు యువకుడు
- మరో మహిళ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు
- వృత్తిగత ఒత్తిళ్లు, మారుతున్న జీవనశైలితో ఆగిపోతున్న ప్రాణ దీపాలు
- కుటుంబాలకు తీరని శోకం..
- స్వగ్రామంలో విషాద ఛాయలు

## సెకన్లలోనే ఆగిన గుండె

- ఉన్నట్టుండి కుప్పకూలి మహిళ మృతి
- గృహ ప్రవేశ వేడుకలో విషాదం

05

## పరిశ్రమలు లేక యువత వలసలు

- పార్లమెంటులో ఎంపీ కడియం కావ్య
- స్థానికంగానే ఉపాధి కల్పించాలని కేంద్రానికి విన్నపం

05



## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఖజానా శాఖ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం
- స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు

02

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు షురూ



- తెలుగులో ప్రసంగించిన గవర్నర్
- 20వ తేదీన పద్దు ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ నెల 30 వరకు సెషన్ కొనసాగింపు

అక్షరదర్బార్, హైదరాబాద్ :తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగాన్ని వినిపించారు. గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం విశేషం. శ్రమించే తత్వం కలిగిన శాంతికాముక తెలంగాణ ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రాధాన్యతలను ఆయన తన ప్రసంగంలో వివరించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలను సాధ్యమైనంత త్వరగా ముగించాలని అధికార పక్షం కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. గరిష్టంగా పది పని దినాల్లోనే సభా వ్యవహారాలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం 29 లేదా 30వ తేదీల్లో ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదింపజేసి సభను వాయిదా వేసేలా వ్యూహరచన చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సహా కీలక అంశాలన్నీ ఈ పది రోజుల్లోనే పూర్తి కావాల్సి ఉంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా అమలులో జాప్యం, గోదావరి నదీ జలాల వివాదం, మూసీ సుందరీకరణ వంటి అంశాలపై చర్చకు పట్టుబట్టనుంది. ముఖ్యంగా 'సేవ్ తెలంగాణ' నినాదంతో సభలోకి రావాలని బీఆర్ఎస్ సభ్యులు భావిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సింగరేణి బొగ్గు గనుల అవినీతి, ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పీకర్ తీర్పు వంటి సున్నితమైన అంశాలు సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

# మీడియా చిట్‌చాట్‌లు వద్దు!

- అసెంబ్లీలో అప్రమత్తంగా ఉండాలి..
- ప్రతిపక్షాల ప్రశ్నలకు మన వద్ద సమాధానాలు ఉండాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సీఎల్పీ సమావేశం
- హాజరు కాని వారిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు
- నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరికలు



అక్షరదర్బార్, హైదరాబాద్ : శాసనసభ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. సభకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు రాకపోవడంపై ఆయన సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యే విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.

## - భవిష్యత్ ప్రణాళికలే ముఖ్యం

గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని సీఎం అన్నారు. ఇకపై మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే అంశంపైనే దృష్టి సారించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో మూడవ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని వివరించారు. గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి ఒక రోడ్ మ్యాప్ లాంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికల గురించి గవర్నర్ ప్రసంగంలో వివరించారని గుర్తు చేశారు. శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్లోన జరిగిన ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సీఎల్పీ అభినందనలు తెలిపింది.

## - సమన్వయంతో ముందుకు

సభలో మాట్లాడే అంశాలపై విప్లవ మధ్య సరైన సమన్వయం ఉండాలని సీఎం సూచించారు. చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృధా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు మాట్లాడే సమయం ఇవ్వలేదని గుర్తు చేశారు. సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సెషన్ మొత్తం సస్పెండ్ చేసి తనను సభకు రాకుండా చేశారని పేర్కొన్నారు. మహిళా శాసన సభ్యులు చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని, సభా వ్యవహారాల్లో వారి భాగస్వామ్యం అవసరమని చెప్పారు.

# అసెంబ్లీలో 'వందేమాతరం' రగడ

- గీతాలపన సమయంలో ఎంఐఎం సభ్యుల వాకౌట్
- బీజేపీ సభ్యుల తీవ్ర ఆగ్రహం

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజు సోమవారమే సభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉభయ సభల సమావేశం ప్రారంభంలో సంప్రదాయం ప్రకారం 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లడం పెద్ద చర్చకు దారితీసింది. స్పీకర్ సూచన మేరకు గీతాలాపన ప్రారంభం కాగానే ఎంఐఎం సభ్యులు తమ సీట్ల నుంచి లేచి వెలుపలికి వెళ్లారు. గీతం పూర్తయిన తర్వాతే తిరిగి సభలోకి ప్రవేశించారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వందేమాతరం గీతాన్ని గౌరవించకుండా బయటకు వెళ్లడం దేశాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమేనని ధ్వజమెత్తారు. జాతీయ భావాలను గౌరవించలేని వారికి ప్రజాప్రతినిధులుగా కొనసాగే అర్హత లేదని బీజేపీ శాసనసభాపక్షం స్పష్టం చేసింది. వందేమాతరాన్ని అవమానించిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అసెంబ్లీ లాబీల్లో ఒక్కసారిగా రాజకీయ వేడి రాజుకుంది. ఎంఐఎం చర్యను బీజేపీ ఎమ్మెల్యేలు ఘాటుగా ప్రశ్నిస్తుండగా, ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఒకవైపు దేశభక్తి, మరోవైపు సిద్ధాంతాల పేరిట జరుగుతున్న ఈ రగడపై ప్రభుత్వం లేదా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది. బడ్జెట్ సమావేశాల ప్రారంభంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం సభలో వాతావరణాన్ని వేడెక్కించింది.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఖజానా శాఖ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం
- స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు



అక్షరదర్బార్, హనుమకొండ: రక్తదానం అనేది మానవత్వానికి అందించే అత్యున్నత సేవ అని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని హన్మకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. సోమవారం హన్మకొండ కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయ ప్రాంగణంలో, తలసేమియా బాధితులను కాపాడేందుకు జిల్లా అడ్మినిస్ట్రేషన్ – ట్రెజరీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తం అనేక అమూల్యమైన ప్రాణాలను కాపాడుతుందని, ముఖ్యంగా తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడే రోగులకు నిరంతరం రక్తమార్పిడి అవసరమని, వారికి రక్తం ప్రాణాధారమని పేర్కొన్నారు. సాధారణంగా వేసవి కాలంలో రక్త బ్యాంకుల్లో రక్తం కొరత ఏర్పడుతుందని, దీనిని అధిగమించేందుకు యువత, ఎన్‌జీవోలు, సేవా సంస్థలు పెద్ద ఎత్తున శిబిరాలు నిర్వహించాలని కోరారు. రక్తదానంపై అవగాహన కల్పించడంలో, అవసరమైన వారికి సమయానికి రక్తం అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. రక్తదానం చేయడం పూర్తిగా సురక్షితమని, ప్రాణాన్ని కాపాడామనే తృప్తిని మించిన ఆనందం మరొకటి ఉండదని ఆమె అన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల నేతలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. హన్మకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి విజయ చందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి అకవారం శ్రీనివాస్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వేగవంతంగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రజావాణి కార్యక్రమంలో వినతుల స్వీకరణ



అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులను వేగవంతంగా పరిష్కార చర్యలను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ప్రజలు తమ సమస్యలను వివరించారు. జనం వినతి పత్రాలను అందజేస్తూ సమస్యలను చెప్పగా కలెక్టర్ ఓపికగా విని వాటి పరిష్కారానికి చర్యల కోసం సంబంధిత అధికారులను అప్పటికప్పుడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థిస్తూ ప్రజలు 170 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో తప్పనిసరిగా సంబంధిత జిల్లా అధికారులు విధిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి తదుపరి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డీఆర్డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# తక్షణ పరిష్కారమే లక్ష్యం

- ప్రజాదివాస్ లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

అక్షరదర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు.




# వేగవంతమైన సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా సత్య శారద ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 136 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు 60, జీడబ్ల్యూఎంసీకి 15, ఇతర శాఖలకు సంబంధించినవి 61 ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ శాఖలో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత తహసీల్దార్లు కార్యక్రమానికి హాజరుకావడంతో కొంత మేరకు సమస్యల పరిష్కారానికి అవకాశం కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సఖి సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలతకు పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వైవీ గణేష్, డీఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీడబ్ల్యూవో రాజమణి, డీఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వేముల నాగరాజుకు పరామర్శ



అక్షరదర్బార్, హనుమకొండ: మోకాలు గాయంతో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్న గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజును తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి సోమవారం పరామర్శించారు. హనుమకొండ రామ్ నగర్ లోని నాగరాజు నివాసానికి చేరుకున్న ఆయన, నాగరాజు ఆరోగ్య పరిస్థితి గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. గాయం మానటానికి మరి కొంతకాలం పడుతుందని, అప్పటివరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు నాగరాజు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డికి వివరించారు. త్వరలోనే పూర్తిగా కోలుకుని రోజువారి పనిలో నిమగ్నం కావాలని శ్రీనివాస రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యుత్ అంతరాయం కలగొద్దు

- ఓవర్ లోడ్ లేకుండా లోడ్ బదలాయింపులు చేపట్టాలి
- నెలాఖరులోగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు పనులు పూర్తి కావాలి
- 17 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వీసీ




అక్షరదర్బార్, హనుమకొండ : రాబోయే వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి 17 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కార్యాచరణ, విద్యుత్ పనుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల వారీగా సమీక్షించి, ఎక్కడా ఓవర్ లోడ్ సమస్య లేకుండా లోడ్ బదలాయింపు చేపట్టాలి. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలి. ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి. పెండింగ్‌లో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

- ప్రకృతి విపత్తుల ఎదుర్కొనేందుకు సిద్ధం

వేసవిలో వచ్చే భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా 'బ్రేక్ డౌన్ టీమ్స్'ను సిద్ధం చేయాలని, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను అందుబాటులో ఉంచాలని సీఎండీ అన్నారు. 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంగా వంగిన స్తంభాలను, వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని అధికారులను హెచ్చరించారు. 17 సర్కిళ్ల పరిధిలో మీటర్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు యుద్ధప్రాతిపదికన మీటర్లను అమర్చాలని సూచించారు. ఏప్రిల్, మే నెలల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

- ఇతర పనులపై సమీక్ష

రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్‌లో భాగంగా సబ్ స్టేషన్ పనులు, మోడల్ సోలార్ గ్రామాల అభివృద్ధి, పీఎం సూర్య ఘర్ (పీఎం జన్మన్/జుగా) పథకం కింద మౌలిక వసతులు పూర్తయిన చోట వెంటనే మీటర్లు అమర్చాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈలు టి తిరుమల్ రావు, రాజు చౌహాన్, అశోక్, సురేందర్, అన్నపూర్ణ; జీఎంలు శ్రీనివాస్, నాగప్రసాద్, మల్లికార్జున్, వాసుదేవ్, వేణుమాధవ్; ఈఈ (సివిల్) వెంకటేశ్వర్లు, డీఈలు అనిల్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'

అక్షర దర్బార్, మరిపెడ : వేసవిలో విద్యుత్ అంతరాయం కలగకుండా మరిపెడ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖ 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను ముమ్మరంగా అమలు చేస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా కేవలం ఈ ఒక్క నెలలోనే సబ్ డివిజన్ వ్యాప్తంగా ఓవర్ లోడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో 33 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను (24 సింగిల్ ఫేస్, 9 త్రీ ఫేస్) ఏర్పాటు చేసినట్లు ఏడీఈ ఎం. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తాళ్లవూకల్, గాలివారిగూడెంతో పాటు నర్సింలుపేట, చిన్నగూడూరు, ఎల్లంపేట సెక్షన్ల పరిధిలోని పలు తండాలు, గ్రామాల్లో ఈ ట్రాన్స్ ఫార్మర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు. వేసవిలో వ్యవసాయ, గృహ అవసరాలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రుబీనా, పావని, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను బిగిస్తున్న సిబ్బంది



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

## బస్టాండ్ లో చలివేంద్రం ప్రారంభం

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు మరిపెడ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం స్థానిక ఎస్సై కోటేశ్వరరావు ప్రారంభించారు. శ్రీ దుర్గ ఫిజియోథెరపీ యజమాని దామెర్ల ప్రశాంత్ సొంత ఖర్చులతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎండలు ముదురుతున్న వేళ ప్రజల సౌకర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. బస్టాండ్‌కు వచ్చే వేలాది మంది ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన ప్రశాంత్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# వాడబలిజ కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : ములుగు జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా ఫిషరీస్ అధికారి సల్మాన్ రాజును వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ మర్యాదపూర్వకలగా కలిసి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా ములుగు జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన సాంప్రదాయ మత్స్యకారులైన వాడబలిజ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి రమేష్, వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గగ్గూరి రమణ య్య, రాష్ట్ర యూత్ అధ్యక్షులు బొల్లె ఆదినారాయణ పాల్గొన్నారు.



# మల్లేశం గౌడ్ కు సేవారత్న జాతీయ అవార్డు

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆముదాలపల్లి మల్లేశం గౌడ్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా సేవారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో మార్చి 15న జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. కరోనా కాలంలో ప్రజలకు సేవలు అందించడం, పేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ జి. విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



# గాలివారిగూడెంలో సీసీ కెమెరాలు ప్రారంభం

అక్షర దర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పిలుపునిచ్చిన 'నైన్త్ ఐ' కార్యక్రమంలో భాగంగా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను సోమవారం సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మరిపెడ ఎస్సై ఈ. వీరభద్రరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గాలివారిగూడెం గ్రామస్తుల స్ఫూర్తితో మండలంలోని ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు కూడా ముందుకు వచ్చి నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. తద్వారా నేర రహిత మండల స్థాపనకు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.




# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట: మండల కేంద్రంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఏడుగురు లబ్ధిదారులకు రూ.7,00,812 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు భరోసా ఇచ్చేందుకే ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చల్ల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలి

## : ప్రజావాణిలో పత్తిపాక గ్రామస్తుల ఫిర్యాదు



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో ఉన్న స్టోన్ క్రషర్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, కొత్తగా వచ్చే క్రషర్ టెండర్లకు అనుమతులు ఇవ్వకూడదని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తుడుం రాజు మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా కొనసాగుతున్న శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ వల్ల గ్రామంలో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ పేలుళ్ల ధాటికి పెద్దపెద్ద బండరాళ్లు పంట పొలాల్లో పడి వ్యవసాయం నాశనమవుతోందని, డాంబర్ ప్లాంట్ నుండి వెలువడే వాసన, వాయు కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే క్రషర్ పర్మిషన్లను రద్దు చేయాలని వారు ఆర్డీవో, కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాలికె వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల, గజ్జి రాజు, చిట్టి రెడ్డి పద్మ, కందగట్ల ప్రవీణ్ కుమార్, అంకేశ్వరపు సాయి లక్ష్మి, కొడిమాల మహేందర్, గజ్జి రమేష్, గడ్డమీది హారతి, తుడుం స్రవంతి, నాయకులు పెండేల కిరణ్, పోతుగంటి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



# మార్త భిక్షపతికి సేవారత్న జాతీయ అవార్డు

## సామాజిక సేవలకు గుర్తింపు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు మార్త బిక్షపతి సేవారత్న జాతీయ అవార్డును అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ అడ్వైజరీ బోర్డు సభ్యులు దరువు ఎల్లన్న, అవార్డు సెలెక్షన్ కమిటీ సభ్యులు బొమ్మకంటి రాజేందర్ చేతుల మీదుగా ఆదివారం అవార్డును ప్రదానం చేశారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బిక్షపతి 1978 నుంచి సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. 1980 నుంచి బీజేపీ కార్యకర్తగా పనిచేస్తూ 1995లో పరకాల మేజర్ గ్రామపంచాయతీ రెండో వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. పద్మశాలి సంఘం, మార్కండేయ సహకార సమితి, శ్రీనివాస చేనేత సహకార సంఘం వంటి సంస్థల్లో బాధ్యతలు నిర్వర్తించారు.కరోనా సమయంలో ప్రతిరోజూ సుమారు వందమందికి ఆహారం అందించడం, ఉచిత వైద్య శిబిరాలు, కుటుంబ వివాదాల పరిష్కారం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో సేవలందించినందుకు ఈ అవార్డు లభించింది. అవార్డు రావడం పట్ల బిక్షపతి అకాడమీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. పరకాల పద్మశాలి సంఘం, బీజేపీ నాయకులు ఆయనను అభినందించారు.



# చెదిరిన కలలు ఆగిన గుండెలు

- అమెరికాలో ముగ్గురు వరంగల్ వాసుల మృతి
- వారం వ్యవధిలోనే మూడు ఘటనలు
- వీరిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు.. ఒకరు మహిళ, మరొకరు యువకుడు
- మరో మహిళ ఉపాధ్యాయురాలు
- వృత్తిగత ఒత్తిళ్లు, మారుతున్న జీవనశైలితో ఆగిపోతున్న ప్రాణ దీపాలు
- కుటుంబాలకు తీరని శోకం.. స్వగ్రామంలో విషాద ఛాయలు

**అక్షరదర్బార్, వరంగల్ :**

తాము కన్న కలలను సాకారం చేసుకునేందుకు విదేశాలు వెళ్లి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, కన్నవారి ఆశలను నిజం చేయాలనుకునే ప్రవాసుల ఆశలు అర్ధాంతరంగా అడియాశలవుతున్నాయి. అగ్రరాజ్యంలో స్థిరపడి కుటుంబంతో కలిసి ఆనందంగా గడపాలని వెళ్లిన వారి జీవితాల్లో గుండెపోటు పెను విషాదాన్ని నింపుతోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉండే తీవ్రమైన పని ఒత్తిడి, అటు వృత్తిని ఇటు కుటుంబాన్ని సమన్వయం చేసుకునే క్రమంలో ఎదురవుతున్న మానసిక సవాళ్లు వారి గుండె వేగాన్ని ఆపేస్తున్నాయి. వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాడిపత్రి రాకేశ్ (41) ఆదివారం గుండెపోటుతో మరణించారు. మరో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుమార్తె శ్వేత (41) కూడా గుండెపోటుతోనే కన్నుమూశారు. ఆమె స్వస్థలం హనుమకొండ. మనమన్ని చూద్దామని చిదురాల విజయరాణి (55) అమెరికా వెళ్లి అక్కడే కన్నుమూశారు. ఆమె స్వస్థలం వరంగల్. ముగ్గురు వ్యక్తులు కేవలం వారం వ్యవధిలోనే అమెరికాలో గుండెపోటుతో కన్నుమూయడం ఇటు స్వగ్రామాల్లో, అటు వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

### - తల్లిదండ్రులను రమ్మని పిలిచి.. అనంతలోకాలకు

హనుమకొండ చైతన్యపురి కాలనీకి చెందిన కొత్త లక్ష్మారెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె శ్వేత (41) అమెరికాలోని డాలస్‌లో ఇటీవల గుండెపోటుతో మరణించారు. వరంగల్ వికాస్‌నగర్‌కు చెందిన వీరాటి సురేష్‌రెడ్డితో వివాహం తర్వాత 2004లో డాలస్‌లో స్థిరపడిన శ్వేత, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒక శుభకార్యానికి వెళ్లి వచ్చిన ఆమె, తన తల్లిదండ్రులతో వీడియో కాల్‌లో ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. మీకోసం టికెట్లు బుక్ చేస్తాను, మీరు కూడా యూఎస్ రావాలి అని కోరింది. ఆ మాటలు చెప్పిన కొద్దిసేపటికే నిద్రలోనే గుండెపోటు రావడంతో ప్రాణాలు విడిచారు. నిద్రిస్తున్న భార్యను లేపేందుకు ప్రయత్నించిన భర్తకు ఆమె స్పందించకపోవడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



### - మనవడిని చూడాలని వెళ్లిన టీచర్.. అక్కడే తుదిశ్వాస

వరంగల్ పైడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న చిదురాల విజయరాణి (55) అమెరికా వెళ్లి అక్కడే కన్నుమూశారు. వరంగల్ రామనాథపురి నివాసి అయిన ఆమె, తన చిన్న కుమార్తె పూజకు కుమారుడు జన్మించడంతో మనవడిని చూసుకునేందుకు గత నవంబర్‌లో అమెరికా వెళ్లారు. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న సమయంలో కుటుంబంతో సంతోషంగా గడపాలని వెళ్లిన ఆమెను విధి వంచించింది. రెండు రోజుల క్రితం హఠాత్తుగా గుండెపోటు రావడంతో స్థానిక ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మరణించారు. పాఠశాల సిబ్బంది, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు.



### - చిన్న వయసులోనే ఆగిన రాకేశ్ గుండె

వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాడిపర్తి రాకేశ్ (41) మరణం అమెరికాలో స్థిరపడిన తెలుగువారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. పదేళ్లుగా వర్జీనియాలో నివసిస్తూ వృత్తిలో ఉన్నత స్థితికి చేరుకున్న రాకేశ్, ఆదివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశాడు. 2014లో కరీంనగర్‌కు చెందిన తేజస్వినితో వివాహం కాగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉండే విపరీతమైన పోటీ, పని ఒత్తిడి మధ్య కుటుంబాన్ని సాకుతున్న క్రమంలో ఆయన గుండె ఆగిపోయింది. ఉన్నత చదువులు చదివి, విదేశాల్లో స్థిరపడి తమకు అండగా ఉంటాడనుకున్న కొడుకు, చిన్న వయసులోనే మరణించాడనే వార్త వరంగల్‌లోని ఆయన స్వగృహంలో తీవ్ర విషాదాన్ని నింపింది.



# సెకన్లలోనే ఆగిన గుండె

- ఉన్నట్టుండి కుప్ప కూలిన మహిళ
- గృహ ప్రవేశ వేడుకలో విషాదం

అక్షరదర్బార్, ఖమ్మం : ఏ క్షణానికి ఏం జరుగుతుందో ఊహించలేమనే నిజం మరోసారి ఖమ్మం నగరంలో రుజువైంది. ఒక గృహ ప్రవేశ వేడుకలో నవ్వుతూ పలకరించిన మహిళ ఒక్కసారిగా కుప్పకూలి, ప్రాణాలు విడిచిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆనందంగా జరగాల్సిన వేడుకలో విషాద ఛాయలు అలుముకోవడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. తెలిసిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా గాంధీ చౌక్ ప్రాంతానికి చెందిన బొమ్మ సుష్మిత (45) సోమవారం నగర శివారులోని పుట్టకోటలో జరిగిన ఒక గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. వేడుకలో భాగంగా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, నవ్వుతూ గడిపిన ఆమె, వేదికపై ఫొటోలు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెపోటు వచ్చి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సుష్మితకు ఇంజినీరింగ్ పూర్తి చేసిన కుమారుడు ఉన్నాడు. ఆమెకు గతంలోనే గుండెకు సంబంధించిన సమస్య ఉండటంతో, వైద్యులు 'పేస్ మేకర్' అమర్చాలని సూచించారు. అయితే బీపీ నియంత్రణలో లేకపోవడంతో ఆ చికిత్స వాయిదా పడింది. కేవలం మందులతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెప్పడంతో ఆమె మందులు వాడుతూ జాగ్రత్తగా ఉండేవారు. ఇంతలోనే విధి వంచించి, అందరి కళ్లముందే ఆమె ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబాన్ని తీరని వేదనకు గురిచేసింది.

# పరిశ్రమలు లేక యువత వలసలు

- పార్లమెంటులో ఎంపీ కడియం కావ్య
- స్థానికంగానే ఉపాధి కల్పించాలని కేంద్రానికి విన్నపం



అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ ఉమ్మడి జిల్లాలో వేగంగా పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, యువత ఉపాధి కోసం ఇతర నగరాలకు వలస వెళ్తున్న గడ్డు పరిస్థితులపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సోమవారం పార్లమెంట్‌లో గళమెత్తారు. స్థానికంగా పరిశ్రమల అభివృద్ధి లోపించడం వల్లే యువత, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా 15–29 ఏళ్ల మధ్య వయస్సున్న యువతలో నిరుద్యోగ శాతం ఏ మేరకు ఉంది? వలసలను నివారించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటి? అని ఎంపీ ప్రశ్నించారు. వ్యవసాయ పనులు లేని 'ఆఫ్ సీజన్'లో కూలీలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రత్యేక పథకాలు ఏవైనా ఉన్నాయా అని ఆమె కేంద్రాన్ని నిలదీశారు.

### - కేంద్రం ఇచ్చిన గణాంకాలు

ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సమాధానమిస్తూ.. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం తెలంగాణలో యువత నిరుద్యోగం 2017–18లో 23.3 శాతం ఉండగా, 2023–24 నాటికి అది 16.6 శాతానికి తగ్గిందని వివరించారు. దేశవ్యాప్తంగా కూడా నిరుద్యోగిత రేటు 17.8 నుండి 10.2 శాతానికి తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. స్కిల్ ఇండియా, పిఎం కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సమాధానంపై ఎంపీ డా కడియం కావ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం సాధారణ గణాంకాలు, పథకాలతో వరంగల్ వంటి ప్రాంతాల్లోని ప్రత్యేక సమస్యలు పరిష్కారం కావని ఆమె స్పష్టం చేశారు. వరంగల్ ప్రాంతానికి ప్రత్యేక పరిశ్రమలు కేటాయించి, స్థానికంగానే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.




# ముస్లింలకు తోడ్పాటు

**: మరిపెడలో 'రంజాన్ తోఫా' పంపిణీ**

మరిపెడ (అక్షర దర్బార్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫా కిట్లను సోమవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 4వ వార్డులో ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకుడు నూకల అభినవ్ రెడ్డి, జిల్లా నాయకుడు వీసారపు శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ వేళ ముస్లిం సోదరీ సోదరీమణులు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ తోఫా కిట్లను అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని వారు స్పష్టం చేశారు. పారదర్శకమైన పాలనతో ప్రజలందరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ మెరుగు రాము, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష మరియు పార్టీ నాయకులు గుండగాని వెంకన్న, యాకుబ్ పాషా పాల్గొన్నారు.




# మీ గొంతుక! మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915